## క్లుప్తంగా

### జెడ్పీటీసీ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ శ్రీలత

కొత్తూరు: ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఓ కుటుంబాన్ని జెడ్పీటీసీ శ్రీలత ఆదుకున్నారు. బుధవారం ఖాజీగూడలో బాధిత కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఖాజీగూడతాండకు చెందిన రాంజీ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబసభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణ, సంతోష్ నాయక్, రవీందర్‌రెడ్డి, మోహన్‌నాయక్, శ్రీశైలం, జంగయ్య, అజయ్ పాల్గొన్నారు.

### టీడీపీకి పూర్వ వైభవం తెస్తాం

టీడీపీ జాతీయ కార్యదర్శి నర్సింహులు



సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న నర్సింహులు

నందిగామ: టీడీపీకి తెలంగాణలో పూర్వవైభవం తీసుకొస్తామని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి బక్కని నర్సింహులు అన్నారు. మండల పరిధిలోని నర్సప్పగూడలో బుధవారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పుంజుకుంటోందని తెలిపారు. ప్రతి కార్యకర్త పార్టీని ప్రతిష్టం చేసేందుకు పాటుపడాలని సూచించారు. అనంతరం పార్టీ కో ఆర్డినేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహాగౌడ్, పాండు, రాములు గౌడ్, సురేశ్, ఈశ్వర్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

### అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న నేతలు

షాద్‌నగర్: అర్చక రంగంలో ప్రతిభ కలిగిన వారికి ధర్మ రక్షణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇటీవల అవార్డులను ప్రధానం చేశారు. షాద్‌నగర్‌లో శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో పనిచేస్తున్న అర్చకులు రవిశర్మ జ్యోతిష్యరత్న నంది అవార్డు, సంతోష్ వైదిగ ఆగమన జ్యోతిష్య బిరుదును అందుకున్నారు. బుధవారం అవార్డు గ్రహీతలను రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నందీశ్వర్, చింటు, ఆలయ కమిటీ అధ్యక్షుడు శేఖర్, లింగం, ఆంజనేయులు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కొందుర్గు: పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం కొందుర్గు మండలంలోని రామచంద్రాపూర్, మహదేవ్‌పూర్, భైరంపల్లి, ఉత్తరాసిపల్లి, టేకులపల్లి, ముట్పూర్, రేగడిచిల్కమర్రి గ్రామాల్లో పర్యటించారు. రాఖీ రక్ష కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రాఖీలు కట్టి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు ప్రదీప్, అశోక్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భూపతిరెడ్డి, వీరేశం, ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

### నేడు సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ

చేవెళ్ల: నేడు చేవెళ్ల మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం, సభ నిర్వహిస్తున్నట్లు చేవెళ్ల మండల గౌడ సంఘం నాయకుడు కేసారం రాముగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సబితారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో పాటు పలు పార్టీల నాయకులు హాజరవుతారని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని శంకర్‌పల్లి చౌరస్తాలో విగ్రహావిష్కరణ అనంతరం కేజీఆర్ గార్డెన్‌లోసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని గౌండ సంఘం నాయకులు, ప్రజలు పాల్గొనాలని విజయవంతం చేయాలని కోరారు.

# వాజ్‌పేయి మార్గం అనుసరణీయం

- దేశానికి ఎనలేని సేవలు చేశారు
- ప్రజల్లో ఆయన స్థానం సుస్థిరం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రకాశ్
- మాజీ ప్రధానికి ఘన నివాళి



చేవెళ్ల: మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

చేవెళ్ల: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి చూపిన మార్గం ఆదర్శమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ అన్నారు. ప్రధానిగా ఆయన దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. చేవెళ్ల మండల కేంద్రంలో బుధవారం బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రకాశ్ మాట్లాడుతూ ప్రధానిగా ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. అనేక సంస్కరణలతో దేశాభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. బీజేపీకి దేశవ్యాప్తంగా ఆయన బలమైన పునాదులు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకుడు విజయ్‌కుమార్ మండల పార్టీ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, క్రిష్ణగౌడ్, వెంకట్‌రామ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

**కార్యాలయాల్లో...**

షాద్‌నగర్: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి నాయకులు నివాళి అర్పించారు. అనంతరం బీజేపీ నాయకులు మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా దేశానికి ఎన్నో సేవలు చేశారని గుర్తుచేశారు. విలువతో కూడిన రాజకీయాలు చేశారని తెలిపారు. పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఆయన ఎన్నో సేవలు చేశారని తెలిపారు. దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహానేత వాజ్‌పేయి అని కొనియాడారు. దేశంలో అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, రుషికేష్, వంశీకృష్ణ, శ్రీనివాస్, వెంకటేశ్, మురళీ, బాలరాజు, సాయిగౌడ్, భరత్ పాల్గొన్నారు.

**జీవితాన్ని అంకితం చేసిన వాజ్‌పేయి**

షాబాద్: మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి మాతృభూమి కోసం తన జీవితాన్ని అంకితం చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి దేశాభివృద్ధికి బాటలు వేసిన మహానాయకుడని కొనియాడారు. ప్రపంచానికి భారత శక్తిని చూపించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బీజేపై ఎం స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి మానేయ్య, నాయకులు శ్రీశైలం, రవీందర్‌రెడ్డి, రవిచారి, విక్రమ్‌రెడ్డి, వినయ్, మల్లికార్జున్ తదితరులున్నారు.



షాద్‌నగర్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



షాబాద్: వాజ్‌పేయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

# ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్

నందిగామ: ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నందిగామ, కొత్తూరు మండల పార్టీ అధ్యక్షులు జంగ నర్సింహాయాదవ్, హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. ముఖ్యంగా బూత్ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఉమ్మడి మండలంలో 54 బూత్ కమిటీలను నియమించినట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలను గ్రామస్థాయి వరకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, ఎన్నికల కో ఆర్డినేటర్లు పురుషోత్తం, బాబర్ ఖాన్, నరేశ్, నాయకులు అంజయ్య, బాల్‌రాజ్ గౌడ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీని గెలిపించండి

బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహ

కేశంపేట: కేంద్రం, రాష్ట్రంలో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపుతో మండలంలోని ఇప్పలపల్లి, దత్తాయపల్లి, కొండారెడ్డిపల్లి, పోమాల్‌పల్లి, దేవునిగుడి తండా, కాకునూర్ గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహయాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం పేర్లు మార్చి అమలుచేస్తోందని విమర్శించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని తగిన గుర్తింపు ఇస్తారని తెలిపారు. ఆయా గ్రామాల్లో ఈ సందర్భంగా బీజేపీ వాల్‌పోస్టర్లను గీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఏపీ మిధున్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉదయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, రఘురాం గౌడ్, కుమారస్వామి, నర్సింలు, భక్తవత్సల్, మహేష్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కో ఆర్డినేటర్‌గా మహేందర్‌గౌడ్



మహేందర్‌గౌడ్

చేవెళ్ల: చేవెళ్లకు చెందిన మహేందర్‌గౌడ్ నియోజకవర్గం సోషల్‌మీడియా కో ఆర్డినేటర్‌గా ఎంపికైనాడు. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా యూత్ కమిటీలను ప్రకటించారు. ఈ కమిటీలో మహేందర్‌గౌడ్‌కు నియోజకవర్గం సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో యూత్ కాంగ్రెస్‌లో తనకు పదవీ అప్పగించినందుకు పార్టీకోసం కష్టపడి పనిచేస్తానని చెప్పారు. సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా పార్టీ కార్యక్రమాలను ప్రసారం చేస్తానని చెప్పారు. అన్ని మండలాల సోషల్ మీడియా కో ఆర్డినేటర్లను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి సహకరిస్తామని చెప్పారు.

### స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ పద్మజ, వాసు

మొయినాబాద్ రూరల్: విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులకు వర్చుసా కంపెనీ స్కాలర్‌షిప్ అందజేయడం అభినందనీయమని వీజేఐటీ కళాశాల డీన్ డాక్టర్ పద్మజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి–2023లో 250 మందికి కళాశాలలో వర్చుసా కంపెనీ పోటీలు నిర్వహించింది. గెలిచిన వారికి స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే ఆ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో వారికి బుధవారం రూ. 50 వేల చొప్పున మూడున్నర లక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్చుసా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ వాసు పెండ్యాల, కళాశాల ప్రిన్సిపల్ సాయిబాబరెడ్డి, ఏవో వెంకటాచలం, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కౌశిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# బహుజన రాజ్యంలో అందరికీ న్యాయం

బీఎస్పీ మండల అధ్యక్షుడు వెంకటేశ్



కార్మికులతో సమావేశమైన వెంకటేశ్, యాదగిరి తదితరులు

షాబాద్: బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పని చేస్తోందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ తెలిపారు. బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాలతో మండలంలోని నాగర్‌గూడలో జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు యాదగిరి ఆధ్వర్యంలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన రాజ్యంలో కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. మాజీ సీఎం మాయావతి స్ఫూర్తితో బహుజనులకు రాజ్యాధికారంలో వాటా కల్పించేందుకే బీఎస్పీ పోరాటం చేస్తోందన్నారు. బహుజనులమంతా కలుద్దాం, నిలుద్దాం, గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సీఎం అయితేనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు స్వామి, రవి, సురేశ్, మల్లేశ్, రాంచందర్, కృష్ణ, జంగయ్య, మాణిక్యం, సుధాకర్ తదితరులున్నారు.

# దాతల కృషి అభినందనీయం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు

మొయినాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వారి బలోపేతానికి దాతలు అందించే కృషి అభినందనీయమని సురంగల్ సర్పంచ్ లావణ్య అన్నారు. మండలంలోని సురంగల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన గుమ్మాల సీతారాంరెడ్డి సహకారంతో బుధవారం స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సీతారాంరెడ్డి విద్యార్థులకు బ్యాగులు అందజేయడం అభినందనీయమన్నారు. యువకులు పాఠశాల అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఇందిరమ్మ, వార్డు సభ్యులు భాస్కర్, షఫీ, విక్రంరెడ్డి, నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జహీర్, ఉపాధ్యాయురాలు రాధ, యువకులు పాల్గొన్నారు.

# గెలుపోటములు సహజం



బహుమతులు అందజేస్తున్న మాణిక్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: యువత విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త మాణిక్‌రెడ్డి ఆకాంక్షించారు. అజీజ్‌నగర్‌లో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాణిక్‌రెడ్డి పాల్గొని గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొన్నప్పుడే ప్రతిభను కనబరుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజీజ్‌నగర్ బీఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, పసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# 'గృహలక్ష్మి'తో కొత్త నాటకం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి



స్థానికులతో మాట్లాడుతున్న శ్రీవర్ధన్‌రెడ్డి, నేతలు

షాద్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఓట్ల కోసమే గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం హాజిపల్లిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల అర్హులను కలిశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. వందల కోట్లతో నూతన సెక్రటరేట్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ప్రభుత్వం నిర్మించిందని, కాని పేదలకు మాత్రం ఇళ్లను నిర్మించి ఇవ్వడంలో పూర్తిగా విఫలమయ్యారని దుయ్యబట్టారు. షాద్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం షాద్‌నగర్‌లో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. అప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, మురళీ, భరత్, సాయిగౌడ్, చందు తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని ప్రభుత్వం

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి



వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మొండోనిరాయి గ్రామ పంచాయితీ పరిధిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పార్టీ నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం రైతులు కష్టపడి సాగు చేస్తే ప్రకృతి వైపరిత్యాల నష్టపోతున్నారని తెలిపారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతులందరికీ పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నేనావత్ సోమ్లా నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నేనావత్ శంకర్, ఉపాధ్యక్షులుగా నరేశ్, నర్సింలు, శంకర్, ప్రధాన కార్యదర్శిగా రమేశ్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు సక్కునాయక్, నాయకులు నవీన్, సునీల్, కుమార్, రాజు, శంకర్ నాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం షాబాద్ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోందని విమర్శించారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు అంటూ హామీలు ఇవ్వడం తప్ప ప్రజలకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కర్ణాటకలో తరహాలో పథకాలను అమలు చేస్తామని, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, రూ.15 వేల రైతుబంధు అందిస్తామన్నారు. రైతు, యువత, నిరుద్యోగ, బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు ఆంజనేయులు, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్ రవీందర్‌నాయక్, నాయకులు నర్సింహులు తదితరులున్నారు.

### హెడ్ మాస్టర్‌పై చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రొద్దటూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగయ్యపై చర్యలు తీసుకోవాలని స్థానిక సర్పంచ్ నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం రోజున పాఠశాలలో విద్యార్థులతో ఉత్సవాలు నిర్వహించకుండా నామమాత్రంగా జెండాను ఆవిష్కరించారని ఆరోపించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని, రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

### బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నందిగామ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ మండల ఇన్‌చార్జి నర్సింహాగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులను ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రణధీర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బలోపేతానికి మహిళల కృషి



సమావేశంలో మాట్లాడుతున్న థెరిసా ఫ్రాన్సిస్

చేవెళ్ల: మహిళలు రాజకీయాల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి థెరిసా ఫ్రాన్సిస్, రాష్ట్ర కమిటీ మహిళా ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి ఆకాంక్షించారు. చేవెళ్లలో పార్టీ మండల మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ మహిళలు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని చెప్పారు. పార్టీ బలోపేతానికి మహిళల కృషి ఎంతో అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలుగా బండారు శైలజను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. చేవెళ్ల మండల కమిటీతో పాటు పలు గ్రామాల కమిటీలను కూడా ప్రకటించారు. చేవెళ్ల మండల కమిటీ మహిళ అధ్యక్షురాలుగా సమత, ఉపాధ్యక్షురాలు స్వరూప, పుష్పలత, ప్రధాన కార్యదర్శిగా గీత, సంయుక్త కార్యదర్శులుగా శోభ, స్వాతి, కోశాధికారిగా సుజాతతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సభ్యులు స్వాతి, షీలా, దేవమ్మ, సలీమా, జంగీర్‌బీ, చంద్రకళ, అరుణమ్మ, లతా, రాధ, అనిత, తదితరులు ఉన్నారు.

# విద్యాభివృద్ధికి సహకరించాలి



విద్యార్థులకు బ్యాడ్జ్, బెల్టులను అందిస్తున్న అక్బర్

శంకర్‌పల్లి: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని శంకర్‌పల్లి మండల విద్యాధికారి అక్బర్ పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాహేర్ ఆలీ బుధవారం మహారాజ్‌పేట్ జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 18మంది విద్యార్థులకు సొంత డబ్బులతో టైబ్యాడ్జ్, బెల్ట్, పలకలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని కోరారు. విద్యార్థులు కూడా చదువుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవన జ్యోతి, యాజమాన్య కమిటీ చైర్మెన్ నర్సింలు, ఉపాధ్యాయులు అనసూయ, రవిందర్‌రెడ్డి, కృష్ణ, రియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.